# ఆదర్శం ! నీ ఖరీదెంత ?

రోడ్డుమీద పాదరసం ప్రవహిస్తున్నట్లుంది ఎండ. తలుపు లేసుకుని ఇంట్లో పడుకుంటే చల్లగా, హాయిగా వుంది. పుస్తకం పట్టుకుని మంచం మీద వాలాను. మాగన్నుగా నిద్రపట్టేసింది.

"స్టీలు సామాన్లే..." అనే గ్యాస్ హారన్‌లాంటి కేక నాచెవుల్లోంచి దూసుకుపోయింది. ఉలిక్కిపడి లేచాను. సమయం ఒంటి గంటయింది. చటుక్కున తలుపుతీసి వరండాలోకి వచ్చి—

"ఏయ్ స్టీలు సామాన్లూ....!" అంటూ కేకేశాను. నా గొంతు జీర బోయింది నిద్రలోంచి లేవడంవల్ల. గట్టిగా అరిస్తే కాని మాట పెగిలి రాలేదు.

అతనొచ్చి గంప దించుకున్నాడు. దాన్నిండా రకరకాల స్టీలు సామాన్లుతళతళా మెరుస్తున్నాయి. అందులో వుంది నేను ఎప్పటినుంచో కావాలనిమోజుపడుతున్న స్టీలు క్యారియర్. అదెంతో ముద్దుగా చూడ ముచ్చటగావుంది. దాన్నిండా ఏ లడ్డూలో, చక్రాలో చేసి పెడితే పిల్లలు నాలుగురోజులు హాయిగా తింటారు. దర్జాగా వుంటుంది అనిపించింది.

నేను లోపలికెళ్ళి బట్టలమూట తెచ్చాను. అతను అన్నీ విడదీసి, యెంపిక చేస్తున్నాడు. ముఖంలో ఏ భావం కనిపించకుండా వాటిని లెక్క పెడుతూ పరీక్షిస్తున్నాడు. అన్నీ మంచిబట్టలే. అస్సలు చిరగలేదు. కొన్ని కాస్త వెలిశాయేమో! కొన్ని కాస్త పాతబడ్డాయేమో-అంతే!

అన్నీ లెక్క చూసి ఒక చిన్నగిన్నె తీసి చూపించాడు. నాకు ఒళ్ళు మండిపోయింది.

"ఏమయ్యా! ఇన్ని బట్టలకి ఇదా ఇచ్చేది? ఏం వద్దులే" అంటూ బట్టలు నావైపు లాక్కున్నాను.

"అన్నీ నలిగాయమ్మగారూ - అంతకుమించి ఏమీరాదు" అంటూ నసిగాడు.

"ఏమిటీ—! నాలుగు చీరలు, రెండు ప్యాంట్లు మూడు షర్టులు పదహారు జాకెట్లు, పది చిన్న చొక్కాలు – ఇన్నిటికీ ఏమీరాదా, పోనీలే, వద్దులే నాయనా" అన్నాను బెట్టుగా.

"దానికేముందండీ, మీకు కావల్సిందేమైనా వుంటే అడగండి" అన్నాడు బేరాన్ని వదలకుండా.

"ఈ క్యారియర్ ఇస్తే ఇయ్యి" అన్నాను ఖచ్చితంగా.

"పైన యిరవై రూపాయలిస్తే అదొస్తుంది" అన్నాడు.

"పైసా యివ్వను. అయినా వద్దులే నాయనా, ఎవరికేనా యిస్తే పుణ్యమైనా వస్తుంది" అని నేనంటూండగా బయట స్కూటర్ శబ్దమైంది.

"కిట్టదులేమ్మా" అన్నాడు గంప ఎత్తుకుంటూ. అనుకోకుండా ఆ సమయంలో ఆయన రావడం నాకెలాగో అనిపించింది. భయం వేసింది. ఆయన వచ్చే సమయంకాదు. అలాంటిది ఈరోజు వచ్చారు.

నేను బట్టలు లుంగజుట్టి లోపల పడేశాను. సామాన్లతను నా కంగారు గ్రహించినట్లున్నాడు. గంప తలమీద పెట్టుకుని కదిలాడు. నాలుగు వీధులు తిరిగి రావడం, మళ్ళీ బేరం మొదలు పెట్టడం వాళ్ళకి అలవాటే.

ఆయన చిరచిరలాడుతూ లోపలికొచ్చి తాడెత్తున లేచారు.

"నీకసలు బుద్ధిలేదు. ఎన్నిసార్లు చెప్పాను? పాతబట్టలతో వ్యాపారం వద్దని. పాపం ఎంతోమంది పేదవాళ్ళు వొంటినిండా బట్టలేక బాధపడుతూ వుంటారు. ఆ గుడ్డలు అలాంటివారి కెవరికైనా యివ్వమని లక్షసార్లు చెప్పాను. అయినా నువ్వు వినవు. సంస్కారం వొకళ్ళు నేర్పితే వచ్చేది కాదు" అంటూ చీదరించుకున్నారు.

"మంచివారే, అన్ని బట్టలు దానధర్మాలు చెయ్యడానికి మనమే మైనా లక్షాధికార్లమా? ఏం? ఒక స్టీలుగిన్నె వస్తే పోయిందేముంది? అయినా ఒక్క గుడ్డ చిరిగిందిలేదు, పోనీ యిద్దామన్నా" అన్నాను.

"చిరిగిపోయాక ఇస్తే వాళ్ళేం కట్టుకుంటారు? మంచివి ఇవ్వటానికి మాత్రం నీకు మనసురాదు" అని విలేశారు.

నాకు భలే కోపం వచ్చింది.

"ఎన్ని బట్టలని యిస్తామండీ, మీకు బొత్తిగా ఏమీ తెలీకుండావుంది. ఒకవేళ యిచ్చినా, వాళ్ళకేమైనా కృతజ్ఞతా - పాడా? ఒకటిస్తే అస్తమానూ కాల్చుకు తింటారు" అన్నాను రుసరుసలాడుతూ.

"ఓసీ పీనాసిదానా, మనం వాడేసినవీ, పనికిరానివీ కూడా సొమ్ము చెయ్యాలా! పాపం, మనింట్లో పనిచేసే లింగమ్మకి యిచ్చినా కట్టు కుంటుందిగా_నీ ఖర్మ నువ్వేడు. నేను చెప్పినా నువ్వు వింటావా" అంటూ తాను తీసుకోవాల్సిన కాగితాలు తీసుకుని కాఫీ తాగి వెళ్ళిపోయారు.

అందుకే మా ఆయనకేమీ తెలీదంటాను నేను. లేకపోతే పేద వాళ్ళు, పేదవాళ్ళు అంటూ వున్నవన్నీ దానం చేసేస్తూంటారు. ఆయ నుండగా ఎవరైనా ముష్టివాళ్ళు వస్తేదాలు. ఆరోజు ఇల్లు గుల్లే. చెప్పినా- ఇదిగో- ఇదే ధోరణి. మనం మాత్రం లక్షాధికార్లమా- నిజానికి లక్షలున్న వాళ్ళు పైసా విడవరు, మీ కెందుకీ బాధ అంటే వినిపించుకోరు. వితండ వాదం మొదలు పెడతారు.

నాకిలాంటి ఆదర్శాలంటే వొళ్ళుమంట. పేదవాళ్ళు అంటే ఎవరు? వొళ్ళువంచి పనిచెయ్యడం యిష్టంలేక, ఎవ్వరేనా అప్పనంగా యిస్తే తీసు కోవటానికి సిద్ధంగా వుండేవారు.

ఈ మాట ధైర్యంగా అంటాననే ఆయనకి కోపం. నాకు మంచి

మనసు లేదంటారు. కఠినమైన దాన్నంటారు. దానగుణం లేదంటారు. ఏమన్నా అనుకోనీండి. నాకేమిటి? ఆయనేదో అన్నారని విక్షేపంలాంటి పాతబట్టలతో స్టీలుక్యారియర్ కొనకుండా ఆ దరిద్రపుమూకకి ఇస్తానేమిటి? మా ఆయనకి ఇప్పుడెంత చెప్పినా అర్థంకాదు. ఒకరోజు వస్తుంది. ఇంట్లో ఎంతో సామాను ఈ విధంగా అమర్చి పెట్టిననాడు ఆయనే అంటారు.

"నువ్వు చెప్పిందే నిజంసుమా" అని. నాకది ఖచ్చితంగా తెలుసు. అందుకే ఇప్పుడాయన తిట్టినా నేను ఓర్పుపట్టి వూరుకుంటున్నాను. ఆయన కేమీ తెలీదని సరిపెట్టుకుంటున్నాను.

* * *

కూర, పులుసు క్యారియర్‌లో సర్ది, అనసూయమ్మగారికి యిచ్చి రమ్మని పెద్దాడిని బతిమాలుతున్నాను.

ఎలా విన్నారో-వచ్చేశారు. "ఎందుకు వాళ్ళకివ్వడం?" అంటూ.

"పులుసు ఎంతో బాగా కుదిరింది. నా వంటలంటే ఆమె పడి చచ్చిపోతుంది" అని నెమ్మదిగా చెప్పాను.

"పాపం, ఆ లింగమ్మ అన్నంలోకి ఏదీలేదు. ఏదైనా పెట్టమని అడిగి అడిగి వెళ్ళింది. దానికివ్వలేక పోయావా ?"

"బాగుందండీ మీ వరస. ఇవేం పాచి పదార్థాలు కావు. వాళ్ళెంతో యిష్టంగా తింటారని పంపుతున్నాను."

"ఏం? లింగమ్మయితే ఇష్టంగా తినదా ? నీకు అడ్డమైన చాకిరీ చేస్తుంది కదా, దానికేం పెట్టవేం-ఆ అనసూయమ్మ నీకేం పనిచేస్తుంది?"- అన్నారు చివరిమాట వెటకారంగా.

"చాల్లెండి. ఎవరైనా వింటే నవ్విపోతారు. వాళ్ళెక్కడ, వాళ్ళ అంతస్తెక్కడ-మనకి పనిచేసి పెట్టడమేమిటి" అన్నాను కోపంగా.

ఏదో విధంగా యిలాంటి దెబ్బలాటలు, వాగ్వివాదాలు మా మధ్య ఎక్కువై పోయాయి. ఇంతకాలం ఒకమాట అని వూరుకునేవారు. ఇప్పు డలాకాదు. తను అనుకున్నది పట్టుకుని వదలటంలేదు. నాచేత ఆ పని చేయించి కాని విడవటంలేదు. నా పాతగుడ్డల స్టీలు సామానుమీద నిఘా వేశారు. మగాళ్ళు ఇలా ప్రతి విషయంలోనూ పట్టించుకుంటే భలే కష్టం. ఆమాట ఎన్నిసార్లు చెప్పినా చెవికి ఎక్కదు. తన ధోరణే తనది.

* * *

నేను మంచి పని హడావుడిలో వుండగా అనసూయమ్మగారొచ్చా రని మా పెద్దాడు చెప్పాడు. ఎక్కడపని అక్కడ వదిలేసి ముందు గదిలో కెళ్ళాను. ఆమె ఎప్పుడూ మా యింటికి రాలేదు. అలాంటిది ఇవాళ మా యింటికివస్తే నాకు గర్వంగా అనిపించింది.

"కామాక్షిగారూ, మీరూ పని తొందరలో వున్నారు. మేమూ త్వరగా వెళ్ళాలి. అందుకని రెండే మాటల్లో విషయం చెప్తాను. ఈమె శ్రీలక్ష్మిగారని, సి.ఇ.గారి భార్య. మీరు, మేం మొదలు పెట్టబోయే కార్య క్రమానికి చెయ్యూత నిస్తారని వచ్చాం" అన్నారు అనసూయమ్మగారు.

నాకేమీ అర్థంకాలేదు. "మీకు నేనేం చెయ్యగలను?" అన్నాను.

"బీదసాదలకు సహాయం చెయ్యడం మా ముఖ్యమైన ఉద్దేశం" అన్నారు.

"నేనేం చదువుకోలేదు. ఉద్యోగం అదీ..."అంటూ పూర్తి చెయ్య కుండానే ఆమె అందుకుని "మీకు చేతనైందే. మంచిమనసు వుంటేచాలు. చదువులతో పనిలేదు" అన్నారు.

నేను సరేనన్నాను. ఇద్దరూ మరొక నమస్కారం పెట్టి వెళ్ళి పోయారు—

ఇంతకీ నేనేం చెయ్యాలో చెప్పలేదు.

o o o

అనసూయమ్మగారు చెప్పిందివిని ఆలోచనలో పడ్డాను. పేద పిల్లలకి పంచిపెట్టడానికి ఇంటింటినుంచీ చొక్కాలు, లాగూలు, చీరలు, రవికలు పోగుచేస్తున్నారట. ఒక్క_క్షణం నా మనసు పీకింది-అన్ని బట్టలు వూరికే ఇవ్వాలంటే. పోని కొన్నే యివ్వచ్చులే అని సరిపెట్టుకున్నాను. కాని దీని వల్ల ఇంట్లో మావారి దగ్గర నా పరపతి పెరుగుతుంది. ఆయన ఎంతో ఆనందిస్తారు. అందుకే సరే నన్నాను.

ఆరోజు రాత్రి మా కార్యక్రమం మా వారికి చెప్పాను. ఆయన ఎంతో సంతోషించారు. వెంటనే ఓ ఏభై రూపాయలు తీసి నాకిచ్చి, "నీకు కావాలనుకున్న స్టీలు క్యారియర్ కొనుక్కో" అన్నారు.

మా ఆయన అమాయకత్వానికి నవ్వుకున్నాను. పోనీలే ఓ ఏభై బహుమతి దొరికిందని ఆనందించాను. ఏవో కాసిని బట్టలు ఒక్కసారి యిచ్చాను ఎప్పుడూ ఇస్తానేమిటి? అనుకున్నాను. ఆయన దగ్గర నాహోదా పెరిగింది.

బీభత్సంగా తెల్లవారిందారోజు. ఒకటే ఈదురుగాలి - కుండపోతగా వర్షం. నల్లగా, భయంకరంగా మేఘాలు పరుగులు పెడుతున్నాయి. మున్ఫై ఆరుగంటలు తుఫాను-అని రేడియో ఘోషిస్తోంది, గంటకి నూట యాభై, రెండువందల కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని హెచ్చరిస్తోంది. నాకు భయంగా వుంది. మావారు వూళ్ళో లేకపోవడంతో మరీ కంగారుగా అనిపిస్తోంది.

గడియారం ముందుకి కదుల్తోంది. మధ్యాహ్నమైంది. సాయంత్రమైంది. రాత్రయింది. మార్పేమీలేదు. ఒకటే చీకటి. సూర్యుడు ఉదయించనూలేదు. అస్తమించనూలేదు.

చిన్న ట్రంకుపెట్టెతో, ఇద్దరు పిల్లల్ని నడిపించుకుంటూ వానలో తడుస్తూ లింగమ్మ వచ్చి గుమ్మంలో నిలబడింది.

"అమ్మగారూ! కృష్ణ పొంగుతోందంట. లేచి పొమ్మన్నారు. ఈ రాత్రికి ఇక్కడుంటాను. ఎంతలెండి, రేపీపాటికి తగ్గిపోతుంది" అంది.

నిజానికి నాకిష్టంలేదు. కాని దాన్నిప్పుడు కాదంటే అదే గవర్న మెంటు వారిచ్చే స్కూల్లోనో మకాం పెడుతుంది. పనిలోకి రాదు. నానా అవస్థా పడాలి-అని ఆలోచించి సరే అన్నాను. ఇదీ ఒకందుకు మంచిదే. మా ఆయన నన్నీసారి బాలా మెచ్చుకుంటారు. నాస్థానం మరింత పెరుగు తుంది.

లింగమ్మ ఒక మూలగా సర్దుకుని ముడుచుకుని కూర్చుంది.

"అమ్మగారూ, గుడ్డలన్నీ తడిసి ముద్దయ్‌పోయాయి. ఈ చంటా దికి ఏదైనా పాతసొక్కా వుంటే యియ్యండమ్మా- సచ్చి మీ కడుపున పుడతా"నంటూ మొదలుపెట్టింది.

అందుకే వీళ్ళంటే నాకసహ్యం. ఇదిగో రమ్మంటే బాలు- పట్టలేం వీళ్ళని వున్నవేవో అనసూయమ్మగారికి ఇవ్వనే యిచ్చాను. మళ్ళీ యీ మూకకోసం యెక్కడినించి తెచ్చేదీ?

"లేవే తల్లీ. ఒక్కటీ చిరిగిందీ, నలిగిందీలేదు. వుంటే అలాగే యిచ్చేదాన్ని।" అన్నాను మెత్తగా.

"చిరగకపోయినా ఇవ్వచ్చని మొన్న నాన్న అన్నారు కదే" అంటూ అందుకున్నాడు మా పెద్దాడు. వొళ్ళు మండిపోయింది. చెంప పగల గొడదామనుకున్నా. వాడామాట అనేసి పక్క గదిలోకి వెళ్ళి పోయాడు.

లింగమ్మ సణుగుతూ పడుకుంది. మిగిలిన అన్నం పెట్టాను. అదే పిల్లలకి పెట్టి తనూ తింది. వర్షం పడుతున్నా, గాలివీస్తున్నా అంట్లు రాత్రే

తో మేసి లోపల పెట్టేసింది. అన్నం పెట్టాను కదా - ఆ మాత్రం చెయ్యక పోతే ఎలా? అందుకే చేసింది.

తెల్లవారింది. వర్షం తగ్గలేదు. ఆ వర్షంలోనే లింగమ్మ ఎక్కడికో వెళ్ళింది. పిల్లలిద్దరూ చలికి ముడుచుకుని, ఒకే చీర గుడ్డలో చుట్టుకుని నిద్రపోతున్నారు. నేను వంటపని పూర్తిచేసి బయట కొచ్చేసరికి ఇద్దరు పిల్లలకీ చొక్కా లాగూ తొడిగింది లింగమ్మ. పెద్దాడికి సరిపోయాయి. రెండోవాడికి వదులుగా పొడుగ్గా వున్నాయి. వాడు వాటిల్లో మునిగి పోయాడు. నేనా బట్టలు చూసి నిర్ఘాంతపోయాను. వెంటనే కాకపోయినా కొంచెం ఆలోచిస్తే ఎక్కువే అర్థమైంది. ఎప్పుడో యివ్వాలని, స్పెషల్ ఆఫీసర్‌గారిచేత యిప్పించాలనీ, నిర్ణయించారు కదా! ముందే ఎలా యిచ్చే శారు అని అనుమానం నన్ను పీకేసింది. మనసు పట్టలేక లింగమ్మని అడిగాను.

"రెండేసి రూపాయలకి కొన్నానమ్మగారూ - బిడ్డలు చలికి గడ్డయి పోతున్నారు. ఉన్నపళంగా ఇమ్మంటే ఏ అమ్మ మాత్రం ఇస్తాది చెప్పండి. అందుకనీ...." లింగమ్మ ఇంకా మాట్లాడుతూనే వుంది. కాని వాటిలో అన్ని మాటలూ వినిపించటంలేదు. వాక్యాలు అర్థం కావటంలేదు.

ఇంత చిత్తుగా నేను ఓడిపోగలనని నాకా క్షణంలోనే తెలిసింది. నాకే అన్నీ తెలుసునన్న నమ్మకం కరిగి, నీరై పోయింది. నాకు కోపానికి మారుగా ఏడుపొచ్చింది—

ఇంతలో యింటిముందు రిక్షా ఆగింది. ఆయన. అంతవర్షంలో దిగిన ఆయన్ని చూస్తే దుఃఖం మరీ కట్టలు తెంచుకుంది. ఈ కన్నీటికి కారణం నా ఓటమేనని నాకు తెలుసు.

ఆయన కొంత స్తిమితపడ్డాక, ఆపుకోలేక అంతా చెప్పాను. ఆయన నవ్వి—

"ఈ ప్రపంచం ఒక వ్యాపారసంస్థ. అక్కడ సరుకుతోనే కాదు, మనుషుల బలహీనతలతోనూ, తెలివి తక్కువ తనంతోనూ కూడా వ్యాపారం చేస్తారు" అన్నారు.

ఆయన అన్నమాటలే నాలో పదే పదే కదులుతున్నాయి. నేను మొదటినుంచీ తప్పుగానే ఆలోచిస్తూ వచ్చాను. నా కళ్ళఎదుట వున్న భర్త మాటలు నాకంత రుచించలేదు. ఒక్కసారిగా తళుకు బెళుకులతో వచ్చిన అనసూయమ్మగారు, ఆమె స్నేహితురాలు నాకెంతో గొప్పగా కనిపించారు. వాళ్ళ ఆదర్శానికి నేను ఖరీదు కట్టలేకపోయాను గానీ నా తెలివి తక్కువ తనాన్ని వాళ్ళు సొమ్ము చేసుకున్నారు.

చలితో బాధపడుతున్న లింగమ్మ పిల్లలకి నేనే ఆ బట్టలు యిచ్చి వుంటే నాకెంతో ఆత్మసంతృప్తి మిగిలివుండేది. నిజానికి నేను స్వార్థంతో ఆలోచించినా, లింగమ్మ నాకెంతైనా చాకిరీచేసి వుండేది.

ఇది నాకు జీవితంలో గుణపాఠం అనిపించింది. ఎన్నాళ్ళో నన్ను అనేకమైన ఆలోచనలు వెంటాడుతూ కలవర పెడుతూనే వున్నాయి. ఆదర్శానికి ఖరీదు కట్టడం అవివేకం అనిపిస్తూనే వుంది.